క్లుప్తంగా

ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు




జగ్గయ్యపేట అర్బన్, నందిగామటౌన్ : జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గ ప్రజలకు ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను, నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహనరావు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతి కుటుంబం సంక్రాంతి పండుగను సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

నేటి నుంచి నిత్య సహాయ మాత ఉత్సవాలు

జగన్నాథపురం(వీరులపాడు): స్థానిక నిత్య సహాయమాత ఆలయ ఉత్సవాలను సోమవారం నుంచి నిర్వహిస్తున్నట్లు ఫాదర్ జోసఫ్ సుగుణరావు తెలిపారు. స్థానిక చర్చి ఆవరణలో ఆదివారం ఆయన మాట్లాడుతూ ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా 15వ తేదీ నుంచి 17వతేదీ వరకు ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మండలంలోని 22 గ్రామ పంచాయతీలలోని ఆర్‌సియం చర్చి సంఘస్తులు, భక్తులు వేలాదిగా పాల్గొంటారన్నారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

గ్యాస్ కనెక్షన్లు పంపిణీ



నందిగామ: మండలంలోని రామిరెడ్డిపల్లి గ్రామంలోని 50 మంది మహిళలకు ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం ద్వారా మంజూరైన గ్యాస్ కనెక్షన్లను కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కొమ్మినేని రవిశంకర్ ఆదివారం పంపిణీ చేశారు. గ్యాస్ స్టవ్, సిలిండర్, బాండ్‌లను లబ్ధిదారులకు అందజేశారు. గ్రామ సర్పంచి పల్లికంటి అరుణకుమారి, గ్రామ పార్టీ నాయకులు లగడపాటి వీరయ్య, వీరమాచినేని నాగ మల్లేశ్వరరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

హుండీ పగులగొట్టి కానుకల అపహరణ



గూడెంమాధవరం(వీరులపాడు):మండలంలోని గూడెం మాధవరంలో వేంచేసియున్న ఆంజనేయస్వామి వారి ఆలయంలో హుండీ పగలగొట్టి కానుకలు చోరీ చేసిన ఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు అర్చకుడు వెంకటసాయి శ్రీధర్ శనివారం రాత్రి పూజా కైంకర్యాలను పూర్తి చేసుకుని ఆలయానికి తాళం వేసి వెళ్లారు. తిరిగి ఆయన ఆదివారం ఉదయం ఆలయానికి వచ్చి చూడగా ఆలయంలోని హుండీ కొంత దూరంలో పడి ఉండటాన్ని గమనించి వెంటనే సమాచారాన్ని గ్రామస్తులకు తెలియజేశారు. హుండీలో రూ.10వేల వరకు కానుకలు ఉండవచ్చని గ్రామస్తులు, అర్చకుడు తెలిపారు. గ్రామస్తుల సమాచారం మేరకు ఎస్‌ఐ మహాలక్ష్మణుడు సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

చలనచిత్ర పరిశ్రమపై శోభన్‌బాబుది చెరగని ముద్ర



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నటభూషణ్ శోభన్‌బాబు 88వ జయంతిని శోభన్ సిండికేట్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఏలూరు లాకుల వద్ద నిర్వహించిన కార్యక్రమంలో సిండికేట్ అధ్యక్షుడు కళ్లేపల్లి మధుసూదనరాజు, ప్రధాన కార్యదర్శి దారా సత్యం శోభన్‌బాబు విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర శోభన్ సిండికేట్ అధ్యక్షుడు డాక్టర్ కళ్ళేపల్లి మధుసూదనరాజు మాట్లాడుతూ శోభన్‌బాబు మరణించి 16 ఏళ్లు గడిచినా నేటికీ ఆయన మన మధ్యనే ఉన్నాడన్న భావన కలుగుతోందని పేర్కొన్నారు. తెలుగు చలన చిత్ర పరిశ్రమపై చెరగని ముద్రవేశారని కొనియాడారు. నటనలో తన కంటూ ప్రత్యేక శైలిని ప్రదర్శించి అశేష అభిమానులను తన సొంతం చేసుకున్నారని చెప్పారు. ప్రధాన కార్యదర్శి డాక్టర్ ధారా సత్యం మాట్లాడుతూ శోభన్‌బాబు నేటితరం నటులందరికీ ఆదర్శప్రాయుడన్నారు. ఆయన జీవిత విశేషాలను వివరించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ప్రధాన సలహాదారు రేమాల రామకృష్ణ, కన్వీనర్ బి. ఆంజనేయులు, వైస్ ప్రెసిడెంట్ కె.జగన్మోహన్, సహాయ కార్యదర్శి వెంకట్, కేవీ సుబ్బరాజు, రామకృష్ణ, పెద్ద ఎత్తున అభిమానులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన భోగి సంబరాలు



నందిగామలో భోగి మంటలు వేస్తున్న ప్రజలు



చందర్లపాడులో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ అరుణకుమార్



పేటలో చిన్నారులకు భోగిపండ్లు పోస్తున్న మహిళలు

జగ్గయ్యపేట అర్బన్ : సంక్రాంతి పండుగ వేడుకల్లో భాగంగా భోగి పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. జగ్గయ్యపేట పట్టణంలో తెల్లవారుజామునే భోగిమంటలు వేశారు. పట్టణంలోని యర్రయ్యగారి బజారు, బ్రాహ్మణ బజారు, కాకానినగర్‌లో భోగి సంబరాలను ఘనంగా నిర్వహించారు. బంధువులు, స్నేహితుల రాకతో ప్రతి ఇంట్లో ఆనందోత్సాహాలు వెల్లి విరిశాయి. మహిళలు రంగు రంగుల రంగవల్లులను తీర్చిదిద్దారు. వీధుల్లో హరిదాసులు, గంగిరెద్దుల విన్యాసాలు దర్శనమిచ్చాయి. చిన్నారులు ఆనందంతో గాలిపటాలు ఎగురవేస్తూ ఉల్లాసంగా గడిపారు. మహిళలు చిన్నారులకు భోగిపండ్లు పోసి ఆశీర్వదించారు. బలుసుపాడు రోడ్‌లోని పాత వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద భోగిమంటలు వేశారు. చిన్నారులకు భోగి పండ్లు పోసి ఆశీర్వాదించారు. వేదపండితులు కేటీ ఆచార్యులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట మండలంలో...

జగ్గయ్యపేట: భోగి పండుగ వేడుకలను జగ్గయ్యపేట మండల ప్రజలు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారుజాము నుంచే భోగి మంటలు వేసి పండుగకు స్వాగతం పలికారు. యువత వీధుల్లో భోగి మంటలు వేసి సంబరాలు చేశారు. బలుసుపాడు గురుధాం ఆశ్రమంలో భోగి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

సంప్రదాయబద్ధంగా కోడి పందేలు

సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో సంప్రదాయ బద్ధంగా కోడి పందేలు నిర్వహించారు. మండలంలోని బూదవాడ, అనుమంచిపల్లి, షేర్‌మహ్మద్‌పేట, చిల్లకల్లు, తిరుమలగిరి గ్రామాల్లో నిర్వహించిన సంప్రదాయ కోడిపందేలను గ్రామస్తులు ఆసక్తిగా తిలకించారు. కోడిపందేలను తిలకించేందుకు సమీప గ్రామాల ప్రజలు కూడా భారీగా తరలివచ్చారు.

పెనుగంచిప్రోలు మండలంలో..

పెనుగంచిప్రోలు: మండల ప్రజలు భోగిపండుగను ఘనంగా జరుపుకున్నారు. భోగ భాగ్యాలు కలగాలని కోరుకుంటూ తెల్లవారు జామునే యువత, చిన్నారులు కుటుంబసభ్యులతో కలసి ఇళ్ల ముందు భోగిమంటలు వేశారు. మహిళలు తమ లోగిళ్లలో రంగులతో రంగవల్లులు వేసి భోగి శుభాకాంక్షలు తెలియజేశారు. పిండివంటల ఘుమఘుమలు, బంధువుల సందడితో గ్రామాలు కళకళలాడుతున్నాయి. మహిళలు ఇళ్ల ముందు అందమైన రంగవల్లులు తీర్చి దిద్దారు.

వత్సవాయి మండలంలో..

వత్సవాయి : భోగిపండుగను మండల ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. తెల్లవారుజామునే నిద్రలేచి భోగిమంటలు వేశారు. లోగిళ్లలో పోటాపోటీగా రంగవల్లులు తీర్చిదిద్దారు. పండుగకు వచ్చిన బంధుమిత్రులు, కొత్త అల్లుళ్లు, హరిదాసు కీర్తనలు, గంగిరెద్దుల విన్యాసాలతో గ్రామాల్లో సందడి నెలకొంది.

నందిగామలో..

నందిగామ: భోగి పండుగను నందిగామ నియోజకవర్గ ప్రజలు ఆదివారం ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. వేకువజాము మూడుగంటల నుంచే భోగి మంటలు వేయడం ప్రారంభించారు. ప్రధాన రహదారులు, పలు కూడళ్లలో భోగి మంటలు వేశారు. నందిగామ పట్టణంతోపాటు గ్రామాల్లో వీధులన్నీ భోగిమంటల వెలుగులో కాంతులీనాయి. ఇళ్లలోని పాత సామగ్రిని భోగిమంటల్లో వేశారు. భోగి పండుగను పురస్కరించుకుని బొమ్మల కొలువులను ఏర్పాటు చేశారు. చిన్నారులకు భోగిపండ్లు పోసి ఆశీర్వదించారు.

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు

సేవాభారతి ఆధ్వర్యంలో పట్టణంలోని రైతుపేట డొంక్ వద్ద ఆదివారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన ఈ ముగ్గుల పోటీలలో మహిళలు ఆసక్తిగా పాల్గొని అందమైన రంగవల్లులను తీర్చిదిద్దారు. విజేతలకు నిర్వాహకుడు ప్రసాద్ బహుమతులను అందజేశారు.

వీరులపాడు మండలంలో..

వీరులపాడు: సంక్రాంతి పండుగలో భాగంగా భోగి పండుగను ప్రజలు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామునే భోగి మంటలు వేశారు. మహిళలు ఇళ్ల లోగిళ్లను రంగురంగుల రంగవల్లులతో తీర్చిదిద్ది గొబ్బెమ్మలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. డూడూ బసవన్నల గంగిరెద్దుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. పండుగ సందర్భంగా బంధువులు, స్వగ్రామాలకు వచ్చినవారితో గ్రామాలు కళకళలాడగా ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి.

చందర్లపాడులో..

నందిగామ టౌన్: పండుగ సందర్భంగా చందర్లపాడులో నిర్వహించిన సంప్రదాయ క్రీడా పోటీలను ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ ప్రారంభించారు. శిబిరాల వద్ద ఘర్షణలకు తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో పోటీలను జరుపుకునేలా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జెడ్పీటీసీ సభ్యుడు ముక్కపాటి నరసింహారావు, సర్పంచ్ కస్తాల పున్నమ్మ, వైఎస్ఎన్ ప్రసాద్, బండ్లమూడి మాధవరావు పాల్గొన్నారు.



పెనుగంచిప్రోలులో భోగి మంటలు వేస్తున్న గ్రామస్తులు



పెనుగంచిప్రోలులో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు కార్యక్రమంలో చిన్నారులు, మహిళలు



మక్కపేటలో గంగిరెద్దు ఆట



జగ్గయ్యపేట మండలం అనుమంచిపల్లిలో కోడి పందలను వీక్షిస్తున్న అభిమానులు



నందిగామలో చిన్నారులకు భోగిపండ్లు పోసి దీవిస్తున్న మహిళలు



మండల కేంద్రం జజ్జూరులో డూడూ బసవన్నల విన్యాసం



జగ్గయ్యపేటలోని కాకానినగర్‌లో భోగిమంటలు వేస్తున్న యువకులు, చిన్నారులు

బ్రాహ్మణులకు అండగా ఉంటాం

ఎమ్మెల్సీ అరుణకుమార్



బ్రాహ్మణులకు నూతన వస్త్రాలను బహూకరిస్తున్న ఎమ్మెల్సీ అరుణకుమార్

నందిగామ టౌన్: గాయత్రీ బ్రాహ్మణ సేవాసంఘ అభివృద్ధి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ కుమార్ హామీ ఇచ్చారు. పట్టణంలోని సంఘ భవనంలో ఆదివారం సీతారామ కల్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్సీ అరుణకుమార్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. తొలుత అర్చకులు, సంఘ నాయకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అరుణకుమార్ మాట్లాడుతూ ఇప్పటివరకు ఏ ప్రభుత్వం చేయని విధంగా బ్రాహ్మణులకు ఏపీపీ, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ తదితర పదవులు ఇచ్చినట్లు వివరించారు. హైదరాబాద్‌లోని అపోలో ఆస్పత్రి సీఈవో సుబ్రహ్మణ్యం ద్వారా బ్రాహ్మణ సంఘ భవన నిర్మాణానికి రూ.3లక్షలను విరాళంగా అందించనున్నట్లు తెలిపారు. కర్మకాండల భవన ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం పట్టణంలోని బ్రాహ్మణ కుటుంబాలకు ఎమ్మెల్సీ అరుణకుమార్ నూతన వస్త్రాలు బహూకరించగా, బ్రాహ్మణులు ఆయనను ఘనంగా సత్కరించారు. ఏపీపీ ఈశ్వరప్రగడ రంగారావు, సంఘ ప్రతినిధులు సుగుణశేఖర రావు, వైఎస్ఆర్‌కె ప్రసాద్, పిఎల్ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు ఉచిత వైద్య సేవలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ఉచిత వైద్య సేవలను వృద్ధులు సద్వినియోగం చేసుకోవాలని ట్రస్ట్ వైస్ చైర్మన్ తేజ్‌రాజ్ సోలంకీ అన్నారు. దుర్గాపురం విజయ్ నర్సింగ్‌స్కూల్‌లో ఆదివారం వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన ఉచిత వైద్య శిబిరం ఆరోగ్య అగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ట్రస్ట్ సేవలను వివరించారు. వయోవృద్ధులు ఆరోగ్యకర జీవనం సాగించటానికి గానూ తాము ప్రముఖ ఆయుర్వేద, అల్లోపతి, హోమియో వైద్య నిపుణులచే ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేస్తున్నామన్నారు. అలాగే వృద్ధులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆయుర్వేద వైద్య నిపుణులు డాక్టర్ ఏవీ ఎస్‌కే ప్రసాద్, హోమియో వైద్యనిపుణులు డాక్టర్ కోనా వీరబ్రహ్మం పాల్గొన్నారు.

సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి



ఐతవరంలో సంక్రాంతి పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ అరుణకుమార్



పల్లగిరిలో కర్రసామును వీక్షిస్తున్న ఎమ్మెల్సీ అరుణకుమార్, ప్రజలు

నందిగామ టౌన్: సంక్రాంతి పండుగ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ పేర్కొన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మండలంలోని ఐతవరం, పల్లగిరి గ్రామాల సమీపంలో ఏర్పాటు చేసిన సంప్రదాయ క్రీడా పోటీలను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అరుణకుమార్ మాట్లాడుతూ సంక్రాంతి పండుగ అంటనే డూడూ బసవన్నల విన్యాసాలు, అందమైన రంగవల్లులు, పతంగులు, హరిదాసుల కీర్తనలు, ఢమరుక నాదాలు గుర్తుకు వస్తాయన్నారు. ముఖ్యంగా భోగి పండుగ రోజున కుటుంబ సభ్యులంతా ఒకచోట చేరి భోగి మంటలు వేసే సంప్రదాయం కుటుంబసభ్యుల మధ్య ఐక్యతను, బంధాన్ని ప్రతిబింబింపజేస్తాయని పేర్కొన్నారు. సంక్రాంతి పండుగ పేరుతో అసాంఘిక క్రీడలపై దృష్టి సారించకుండా సంప్రదాయ క్రీడలు నిర్వహించుకోవాలని సూచించారు. సంక్రాంతి పండుగను అందరూ సంతోషంగా జరుపుకోవాలంటూ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, నాయకులు గుడివాడ సాంబశివరావు, పాములపాటి రమేష్, చిరుమామిళ్ల చైతన్యకుమార్, పారుపల్లి హరిబాబు, బొల్లినేని శ్రీనివాసరావు, వేల్పుల రమేష్, గరికపాటి భాస్కరం, నెలకుదిటి శివనాగేశ్వరరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



పూర్వ విద్యార్థుల సమ్మేళానికి హాజరైన 2002-03 పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు

పెనుగంచిప్రోలు: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో 2002–03 పదోతరగతి చదువుకున్న పూర్వవిద్యార్థులంతా ఆదివారం తమ పాఠశాలను సందర్శించారు. పాఠశాల రోజులను మళ్లీ గుర్తుకు తెచ్చుకోవడంతోపాటు గత స్మృతులను నెమరవేసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులును మననం చేసుకున్నారు.. యోగక్షేమాలతోపాటు ప్రస్తుతం ఎవరు ఏమి చేస్తున్నారో ఒకరికొకరు అడిగితెలుసుకున్నారు. అనంతరం పెనుగంచిప్రోలులోని తంబరేణి గార్డెన్స్‌లో వారంతా కలిసి సామూహిక భోజనాలు చేశారు. తమతో కలసి చదువుకున్న ముండ్లపాటి రాజేష్ అనేవ్యక్తి అనారోగ్యంతో ఉన్న విషయాన్ని తెలుసుకుని అతనికి రూ.15 వేలు ఆర్థిక సాయంగా అందజేసి స్నేహ ధర్మాన్ని పాటించారు. అనంతరం నాడు పాఠాలు బోధించిన గురువులను సన్మానించి, వారి ఆశీస్సులు పొందారు. పూర్వ విద్యార్థులంతా ఇలా కలవడంపై ఆనందం వ్యక్తంచేశారు.

వైఎస్సార్ సీపీతోనే అభివృద్ధి

గొట్టుముక్కల(కంచికచర్ల):వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కారం చేసిందని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ అన్నారు. గొట్టుముక్కలలో ఆదివారం రాత్రి ఆయన పార్టీ ముఖ్యనాయకులు, కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ అరుణకుమార్ మాట్లాడుతూ గ్రామంలో పార్టీ బలోపేతానికి పనిచేస్తున్న గుదే అక్కారావును పార్టీ గ్రామ అధ్యక్షుడుగా నియమిస్తున్నట్లు తెలిపారు. గొట్టుముక్కల సొసైటీ అధ్యక్షుడుగా ఆలోకం శ్రీనివాసరావును నియమించినట్లు వివరించారు. రిజర్వు ఫారెస్ట్‌లో కొలువై ఉన్న మద్దులమ్మ తల్లి ఆలయానికి వెళ్లే రోడ్డును సొంత నిధులతో ఏర్పాటు చేశానని ఎమ్మెల్సీ వివరించారు. పార్టీ మండల కన్వీనర్ నన్నపనేని నరసింహారావు, తంగెళ్లమూడి రామారావు, మంగలపూడి కోటిబాబు, మంగలపూడి సన్నీ, చింతా రవీంద్రనాథ్, మార్త శ్రీనివాసరావు, దేవరకొండ గురవయ్య, గుదే సాంబశివరావు, కాలవ పెదబాబు పాల్గొన్నారు.

వైభవంగా గోదాదేవి కల్యాణోత్సవం



పల్లగిరిలో స్వామివార్ల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

జగ్గయ్యపేట అర్బన్: మండలంలోని ముక్త్యాలలో వేంచేసియున్న శ్రీభవానీ ముక్తేశ్వరస్వామివారి దేవస్థానం, శ్రీచెన్నకేశవస్వామి వారి దేవాలయంలో ఆదివారం గోదాదేవి కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయాల అర్చకులు అమ్మవార్లకు శాస్త్రోక్తంగా కల్యాణ మహోత్సవం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని కల్యాణోత్సవాన్ని తిలకించారు. ముక్తేశ్వరస్వామి దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్త డాక్టర్ వీఎల్ ఇంద్రదత్, ఈవో జయప్రకాష్‌బాబు పాల్గొన్నారు.

నందిగామలో..

నందిగామ: పట్టణంలోని గీతా మందిరంలో గోదా రంగనాథుల కల్యాణ్యాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పూజలు చేశారు.

పల్లగిరిలో..

నందిగామ టౌన్: మండలంలోని పల్లగిరి గట్టుపై వేంచేసియున్న కల్యాణ వెంకటేశ్వరస్వామి వారి ఆలయ ఆవరణలో నిర్వహించిన గోదా రంగనాయకస్వామి వారి కల్యాణోత్సవంలో ఎమ్మెల్సీ అరుణకుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేసి స్వామివారి శేష వస్త్రంలో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు అనుమోలు పార్థసారథి, సూరె రామారావు తదితరులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా వేడుకలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో సంక్రాంతి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని లక్ష్మీ గణపతి విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన భోగి మంటలను ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు దంపతులు, ఈవో కేఎస్ రామారావుతో పాటు ఆలయ అధికారులు, అర్చకులు, పాలక మండలి సభ్యులు వెలిగించారు. తొలుత భోగి మంట వద్ద ఆలయ చైర్మన్, ఈవోలు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం రాజగోపురం ఎదుట ఏర్పాటు చేసిన గంగిరెద్దులకు పూజలు నిర్వహించి దాణా అందజేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది అమ్మవారి ఆలయంలో సంక్రాంతి వేడుకలను నిర్వహించారు. పల్లె వాతావరణాన్ని తలపించేలా పూరిపాకలు, గంగిరెద్దులు, హరిదాసులు, మట్టి పాత్రల తయారీ, పందెం కోళ్ల గూళ్లు, మేళతాళాలతో తెలుగు వారి సంప్రదాయం ఉట్టి పడింది. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తులు దర్శనం అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పల్లె వాతావరణాన్ని చూసి ముగ్ధులయ్యారు. ఆలయ స్థానాచార్య శివప్రసాద్ శర్మ, ఈఈలు కోటేశ్వరరావు, రమాదేవి, ఆలయ ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు. అమ్మవారి ఆలయంతో పాటు చిన్న గాలిగోపురం, ప్రధాన ఆలయం ద్వారం వద్ద పూలతో చేసిన అలంకరణ అందరిని ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణాన్ని అరటి చెట్లు, మామిడి తోరణాలతో అలంకరించారు.

ఆకట్టుకున్న బొమ్మల కొలువు

రాజగోపురం ఎదుట కళావేదిక వద్ద దేవస్థానం ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు విశేషంగా ఆకట్టుకుంది. వివిధ దేవతా మూర్తుల విగ్రహాలు, కొండపల్లి బొమ్మలతో పాటు పల్లె వాతావరణాన్ని తలపించే బొమ్మలు అందరిని ఆకట్టుకున్నాయి. బొమ్మల కొలువును చైర్మన్, ఈవోలు ఆవిష్కరించి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం బొమ్మల కొలువు వద్ద చిన్నారులకు భోగి పండ్లు పోసి ఆశీర్వదించారు.

భక్తులతో క్యూలైన్లు రద్దీ

అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తులతో ఆలయ ప్రాంగణంలోని క్యూలైన్లు రద్దీగా కనిపించాయి. తెల్లవారుజాము నుంచే పెద్ద ఎత్తున భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. హైదరాబాద్, తెలంగాణాలోని పలు ప్రాంతాలతో పాటు బెంగళూరు, ముంబాయి, పూనే నుంచి పండుగను స్వస్థలాలకు బయలుదేరిన వారు అమ్మవారిని దర్శించుకున్నారు. దీంతో ఉదయం నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు భక్తుల రద్దీతో క్యూలైన్లు కిటకిటలాడాయి.